క్లుప్తంగా

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత



నందిగామ: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు వారధి వంటివారని కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లులో నియమితులైన పలువురు వలంటీర్లకు గురువారం రవిశంకర్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లపై ఉన్న గురుతర బాధ్యతను గుర్తు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్న పథకానికి గురువారం విజయవాడకు చెందిన జంపన ఏడుకొండలు, రమణి దంపతులు రూ.10,116 విరాళంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ జంగం ప్రసాద్‌కు అందజేశారు. పెనుగంచిప్రోలుకు చెందిన బద్దుల సాయిత్రినాథ్ రూ.5,116 అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు ఇచ్చారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆలయంలోని పాలకవర్గ సమావేశ మందిరంలో గురువారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఆలయాభివృద్ధికి పలు తీర్మానాలు చేశారు. ఆలయంలో సప్త ప్రదక్షిణ సేవకు, ప్రస్తుతం ఉన్న ఏసీ కార్యాలయ సమీపంలో ప్రసాదాల విక్రయ కేంద్ర ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. కొండ కింద బాలాజీ సత్రాల స్థానంలో కార్యాలయ భవనం, వీఐపీ లాంజ్ ఏర్పాటుతో పాటు ఈ ప్రాంతంలో ఎనిమిది చోట్ల స్వామి వారి హోర్డింగ్‌ల ఏర్పాటుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఏసీ వర ప్రసాద్, పాలకవర్గ సభ్యులు కోఆప్షన్ సభ్యుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

28,260 మందికి రైతు భరోసా

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో 28,260 మంది రైతు కుటుంబాలకు రైతుభరోసా కింద రూ 2,119.36 లక్షలు విడుదల చేసినట్లు ఏడీఏ సీహెచ్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేట మండలంలో 8,611 రైతులకు రూ.645.83 లక్షలు, పెనుగంచిప్రోలు మండలంలో 7,604 రైతులకు రూ 570.3 లక్షలు, వత్సవాయి మండలంలో 8,574 రైతు కుటుంబాలకు రూ 643.05 లక్షలు, నందిగామ మండలంలో 3,471 మంది రైతు కుటుంబాలకు రూ 260.18 లక్షలు నేరుగా రైతు బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆయుర్వేద మజ్జిగ పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన ఆయుర్వేద మజ్జిగ పంపిణీ కార్యక్రమం గురువారం కొనసాగింది. దాత శ్రీజలలక్ష్మి బోర్‌వెల్స్ ప్రతినిధి అల్లి అర్జునరావు సహకారంతో బాటసారులకు, ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి, సంఘ పెద్దలు మెటికల శ్రీనివాసరావు, అల్లి రవిచంద్, చెరుకుపల్లి నాగరాజు, బొట్ల వీరభద్రం, కర్నాటి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళనకు చర్యలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మిషన్ క్లీన్ కృష్ణా-గోదావరి (ఎమ్‌సీకేజీసీ)లో భాగంగా నగరంలోని మూడు కాలువల ప్రక్షాళనకు నగరపాలక సంస్థ పనులను ప్రారంభించిందని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. విజయవాడ హనుమాన్‌పేట వెహికల్ డిపో వెనుక భాగంలోగల కెనాల్ బండ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. కెనాల్ బండ్‌లో పెరిగిన చెట్లను ట్రిమ్మింగ్ చేయాలని, అలాగే అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం వెహికల్ డిపో ప్రాంతంలోని మూడు కాలువల ప్రక్షాళన పనుల పురోగతిపై ఆయన ఇంజినీరింగ్, హార్టికల్చర్, శానిటేషన్ డిపార్ట్‌మెంట్‌ల అధికారులతో సమీక్షించారు.

సర్కారీ స్కూళ్లలో సకల సౌకర్యాలు



విద్యార్థులకు అందజేయడానికి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు



విద్యార్థులకు కొత్త యూనిఫాం

- పాఠశాలల్లో స్మార్ట్ క్లాసులు
- మారిన స్కూల్ యూనిఫాం
- రెండో తేదీ నుంచి పుస్తకాలు అందజేత



డిజిటల్ తరగతుల కోసం వచ్చిన స్మార్ట్ టీవీలు

జగ్గయ్యపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఈ స్కూళ్లో సకల వసతులు అందుబాటులో ఉంటున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో నాలుగేళ్లుగా విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. నాడు-నేడు ద్వారా అందమైన భవనాలు, డబుల్ డెస్క్ బెంచ్‌లు, డిజిటల్ తరగతులు, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, ల్యాబ్‌లు, ఆర్‌వో నీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, రెండు జతల యూనిఫాం, బూట్లు, బెల్టు, పుస్తకాలతో స్కూల్‌బ్యాగ్ అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు మించి చక్కని యూనిఫాం ఏర్పాటు చేసింది. బాలురు కాఫీ కలర్ ప్యాంటు, గళ్ల చొక్కా, బాలికలు మెరూన్ కలర్ ప్యాంటు, లైట్ పింక్ చుడీదార్‌తో వెళ్లనున్నారు.

డివిజన్‌లో 2.23 లక్షల పాఠ్య పుస్తకాలు

డివిజన్‌లో 2.23 లక్షల పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేయనుంది. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల పరిధిలో 315 మండల, జెడ్పీ పాఠశాలలున్నాయి. ఆరు నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య, నోట్ పుస్తకాలను ఈ నెల రెండు నుంచి పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. పాఠ్య పుస్తకాలతో పాటు జగనన్న కానుక అందించనున్నారు. జగ్గయ్యపేటకు 52,052, వత్సవాయి 25,667, పెనుగంచిప్రోలు 20,707, నందిగామ 39,491 వీరులపాడు 22,589, కంచికచర్ల 28,971 చందర్లపాడు కు 34,078 పాఠ్య పుస్తకాలు వచ్చాయి.

స్మార్ట్ క్లాసులకు ఖరీదైన టీవీలు

ఈ ఏడాది నుంచి నాడు-నేడు ఫేజ్-1లో అభివృద్ధి చేసిన నందిగామ డివిజన్ పరిధిలో 259 పాఠశాలల్లో స్మార్ట్ క్లాసులు నిర్వహించడానికి రంగం సిద్ధమైంది. రెండు నియోజకవర్గాల్లోని 75 పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు, స్మార్ట్ టీవీలను సరఫరా చేసింది. వీటి ఖరీదు రూ. లక్ష. పలు పాఠశాలల్లో టీవీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే విద్యార్థులకు దృశ్య రూపంలో బోధిస్తారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్ల ఉద్దేశం తరగతి గదిలో నోటీస్ బోర్డుగానే కాకుండా భవిష్యత్తులో డిజిటల్ స్క్రీన్‌గా ఉపయోగించుకోవచ్చు.

పాఠ్య పుస్తకాలు అందజేస్తాం

డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తాం. ఇప్పటికే ఎంఈవోలు పాఠశాలల పునః ప్రారంభం రోజున కార్యక్రమం ఏర్పాటు చేసి జగనన్న విద్యా దీవెన కిట్లను అందిస్తారు. డిజిటల్ తరగతుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

–వెంకటప్పయ్య, డీవైఈవో, నందిగామ

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

నవాబుపేట(పెనుగంచిప్రోలు): పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో గురువారం జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఊళ్లకు ఊళ్లు కడుతున్నామన్నారు. గతంలో ఒక్కో గ్రామానికి నామమాత్రంగా ఇళ్లు మంజూరు అయ్యేవన్నారు. జగనన్న పాలనలో అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైన్లు వంటి సౌకర్యాలు కల్పించడం, సిమెంట్, ఐరన్, ఇసుక, కంకర వెంటనే అందిస్తోందన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న విప్ ఉదయభాను

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గింజుపల్లి శ్రీనివాసరావు, మధు, శ్యామల, బాలరాజు, శివకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా మీర్జావలి

కంచికచర్ల: కంచికచర్ల పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా మహ్మద్ ఖాదర్ మీర్జావలికి బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా పంచాయతీ అధికారి సునీత గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మీర్జావలి ప్రస్తుతం మండలంలోని పరిటాల గ్రామ కార్యదర్శిగా, గండేపల్లి, కీసర గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఇప్పటివరకు కంచికచర్ల ఇన్‌చార్జి కార్యదర్శిగా పని చేసిన కనగాల రవికుమార్‌ను మండలంలోని చెవిటికల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మీర్జావలి మాట్లాడుతూ గ్రామంలోని సమస్యల పరిష్కారంతో పాటు వేసవికాలంలో అన్ని వార్డులకు తాగునీరు నిత్యం సరఫరా కావడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



మహ్మద్ ఖాదర్ మీర్జావలి

పింఛన్ల పంపిణీ



బలుసుపాడులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్



సుబ్బాయిగూడెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం పింఛన్ల పంపిణీ మొదలైంది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనుమంచిపల్లి, బలుసుపాడు, పోచంపల్లి, అగ్రహారం, జయంతిపురం, గండ్రాయి గ్రామాల్లో సర్పంచ్‌లు పింఛన్‌లు అందజేశారు. తొలిరోజు 90 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జయచంద్ర తెలిపారు.

పెనుగంచిప్రోలులో 66 శాతం పింఛన్లు అందజేత

పెనుగంచిప్రోలు: సామాజిక పింఛన్ల పంపిణీ జూన్ నెల మొదటి రోజు గురువారం సాయంత్రానికి 66 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ అన్నారు. సాంకేతిక కారణాలతో పింఛన్ల పంపిణీ కొంత ఆలస్యమైందన్నారు. వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో పెన్షన్ల పంపిణీ జోరుగా జరుగుతోంది. పట్టణంలోని 31 వార్డుల్లో ఉన్న వివిధ రకాల పెన్షన్లకు సంబంధించి వలంటీర్లు బయోమెట్రిక్ వేలిముద్రలు, ఐరిస్, ఫేషియల్ ద్వారా పింఛన్ అందజేశారు. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలోని 31 వార్డులకు మొత్తం 4,845 మంది పింఛన్‌దారులకు మొదటి రోజున 73.96 శాతం మందికి రూ 99,79,500 పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు.



పేటలోని క్రిస్టియన్‌పేటలో పెన్షన్లు ఇస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్



18 వ వార్డులో వృద్ధురాలు సయ్యద్ జాన్‌బీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బొట్ల త్రిపుర

ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు

గడప గడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జయంతి(వీరులపాడు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలను అందిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. జయంతి గ్రామంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపనకు వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలు వివరించి పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్ పంపిణీ చేశారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో సాగుతోందన్నారు. గడప గడపకు కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు.

ఎమ్మెల్యే ఆదేశించారు.. మరమ్మతులు చేశారు..

గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు పలు సమస్యలు వివరించారు. దీనిలో భాగంగా జయంతి గ్రామం నుంచి ఎర్రుపాలెం వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయంగా మారిందని రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటంగా ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు ఇప్పల కృష్ణారెడ్డిని ఆదేశించారు. దీంతో వెంటనే మెటల్ గ్రావెల్‌తో మరమ్మతులు నిర్వహించడంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం,ఉపసర్పంచ్ ఇప్పల సుబ్బమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి,ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జయంతి గ్రామంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

డొంకరోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని డొంకరోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌ల సొంత నిధులతో చేసే చందర్లపాడు మండలంలోని లక్ష్మీపురంలో పంట పొలాలకు వెళ్లే డొంక రోడ్డు అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ డొంక రోడ్లు పూర్తిగా ధ్వంసమై పంట పొలాలకు వెళ్లడానికి ఇబ్బందుల పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకువచ్చారన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సొంత నిధులతో పనులు చేపట్టాలని తెలిపారన్నారు. దీంతో గ్రామంలోని డొంక రోడ్డుకు రెండువైపులా పెరిగిన కంప చెట్ల తొలగింపు, మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఆయన బాటలోనే తాము రైతులకు అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. సమస్య తెలపగానే స్పందించిన ఎమ్మెల్యే సోదరులకు గ్రామ రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దర్శి రామారావు, ఆల ప్రభు, బుగ్గినేని సురేష్, వైఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డొంక రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

గ్రంథాలయాల్లో విజ్ఞానం.. వినోదం..

కంచికచర్ల: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందుతున్నాయని శాఖ లైబ్రరీ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించారు.

అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మన జీవితాల్లో అతిపెద్ద సహాయక వ్యవస్థ తల్లిదండ్రులున్న కుటుంబమని దీనితో ప్రతి ఒక్కరూ ఉన్నత జీవితాన్ని ఎంచుకుంటారన్నారు. భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు విద్యార్థులకు డ్రాఫ్ట్, డ్యాన్స్‌మాస్టర్ నవీన్‌నాని నృత్యంతో పాటు యోగా నేర్పించారు. కవి నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు.

గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. శ్రీసాయినటరాజ డ్యాన్స్ అకాడమీ భారతీదేవి విద్యార్థులకు కూచిపూడి నృత్యాన్ని నేర్పించారు. విద్యార్థులతో క్యారమ్స్, చెస్ ఆటలు ఆడించారు. ఉపాధ్యాయుడు డి.బాబూరావు, గ్రంథాలయ సిబ్బంది రమేష్, సత్యవతి పాల్గొన్నారు.



కంచికచర్ల గ్రంథాలయంలో డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

కంచికచర్ల: శిబిరాలు నిర్వహించి పేకాడితే అరెస్ట్ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ పీఎస్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని పరిటాల శివారులో గురువారం పేకాడుతున్న తొమ్మిది మందిని పట్టుకున్నామని వారి నుంచి రూ. 2,250 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కృష్ణుడి బోధనలు అవసరం

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): లోకానికి జ్ఞానాన్ని పంచిన గీతాచార్యుడు శ్రీ కృష్ణ భగవానుడి బోధనలు నేటి సమాజానికి అవసరమని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కొత్తపేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న శ్రీ కృష్ణనామ కోటి జపయజ్ఞము గురువారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన పూర్ణాహుతి ఇతర ప్రత్యేక వైది కార్యక్రమాల్లో మల్లాది విష్ణు పాల్గొన్నారు. తొలుత ఆయన స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురుషోత్తముడు, స్థితప్రజ్ఞుడైన శ్రీ కృష్ణుడు విష్ణుమూర్తి మహోన్నతావతారమని చెప్పారు. శ్రీ కృష్ణ నామాన్ని నిత్యం స్మరించే వారికి పదివేల యజ్ఞాలు, కోటి తీర్థాల పుణ్యస్నానాల ఫలితం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. శ్రీకృష్ణుడి జీవితం ధర్మశాస్త్రమని, సమస్త మానవాళిని సన్మార్గంలో నడిపే విధంగా ఆ పరమాత్ముడు అర్జునునికి గీతను బోధించాడని వివరించారు. గీతాసారాన్ని మనసున నింపుకోగలిగితే జీవితం సంతోషమయం అవుతుందని పేర్కొన్నారు. శ్రీ కృష్ణ పరమాత్ముని కృపా కటాక్షాలు నగర ప్రజలపైన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైన ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ సుమారు ఎనిమిది కోట్ల శ్రీకృష్ణ జపం జరిగిందన్నారు. ఎక్కడ భగవంతుని నామ జపం జరుగుతుందో అక్కడ సాక్షాత్ స్వామి ఉంటారన్నారు. వారం రోజుల పాటు కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. పీఠాధిపతి శ్రీ త్రిదండి వామన మహారాజ్ స్వామి అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమాన్ని నంబూరి శ్రీహరి, కొల్లిపర మల్లేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, తేలప్రోలు వీరయ్య గుప్తా, ప్రసాద్ నిర్వహించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పేద విద్యార్థి ఇంటర్ చదువుకునేందుకు దీవెన ఫౌండేషన్ రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేసింది. కేఎల్‌రావునగర్‌కు చెందిన గొంగటి సుదర్శనరావు కుమార్తె సంధ్య పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ చదువుకునే స్తోమత లేకపోవడంతో దీవెన ఫౌండేషన్ సాయాన్ని కోరింది. దీంతో ఫౌండేషన్ సభ్యులు కొత్తపేట ఎస్‌ఐ షబ్బీర్, ఏఎస్‌ఐ బాబాజీ, కానిస్టేబుల్ గోపరాజు చేతుల మీదగా రూ. 10 వేల సాయాన్ని అందించారు. పేద వారికి సహాయం అందించడంలో ఫౌండేషన్ ముందుంటుందని వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు పేర్కొన్నారు. దాతల సాయంతో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో మంచి స్థాయికి చేరుకోవడంతో పాటు మరి కొంత మందికి సాయం అందించాలని కోరారు.

మానసిక వికలాంగులకు సేవలు అభినందనీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానసిక వికలాంగులకు సేవలు అందించటం సామాన్యమైన విషయం కాదని, వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు అభినందనీయులని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు తెలిపారు. విద్యాధరపురం ఆర్కే పబ్లిక్ స్కూల్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పటం అంటేనే ఎంతో కష్టమని, అటువంటిది మానసికంగా బలహీనంగా ఉండే పిల్లలకు శిక్షణ ఇవ్వటంతోపాటు వైద్య సేవలను అందించటం ఎంతో ఓర్పుతోకూడినదని తెలిపారు. సంస్థ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ జె సునీత, జె ప్రసాద్ మాట్లాడుతూ మానసిక వికలాంగులకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్‌లో స్పీచ్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ వంటి పలు సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సేవల వివరాల కోసం 9985951397 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహేశ్వరరావు

భక్తులకు తక్షణ వైద్య సేవలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్య వచ్చినా వారికి తక్షణం వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులు అందించాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. మహా మండపం 7వ అంతస్తులోని దేవస్థాన ఆరోగ్య కేంద్రాన్ని గురువారం చైర్మన్ రాంబాబు పరిశీలించారు.

డ్యూటీ డాక్టర్ ఏ సమయం వరకు విధులలో ఉంటారు... ఆరోగ్య కేంద్రంలో మందులు, ఇతర పరికరాలను పరిశీలించారు. వైద్య సహాయం కోసం వచ్చిన వారికి తక్షణమే సేవలు అందించేలా సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న దుర్గగుడి ఆలయన కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు

ఫిల్టర్ బెడ్‌ల పరిశీలన

ఇబ్రహీంపట్నం: ఆర్‌డబ్ల్యూఎస్ ఫిల్టర్ బెడ్‌లను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గురువారం పరిశీలించారు. కొండపల్లి మున్సిపాలిటీలో ఏర్పడిన తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనల మేరకు వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. తాగునీటి సరఫరాలో తలెత్తిన సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, అడపా వెంకయ్య నాయుడు, మండే చంద్రశేఖర్‌బాబు, నాయకులు కుమ్మరి శ్రీనివాసరావు, మామిళ్లపల్లి ఆనంద్, పల్లపోతు బ్రహ్మాజీ, నాగరాజు, బాబి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

మైలవరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని పాలా నారాయణరెడ్డి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం దాతలు శివకుమార్‌రెడ్డి కుమారులు బొమ్మారెడ్డి నిహాల్‌రెడ్డి, నికేత్‌రెడ్డిల సౌజన్యంతో మజ్జిగ, నిమ్మరసం, గ్లూకోజ్ నీటిని పంపిణీ చేశారు. ప్రస్తుతం రోహిణీ కార్తెలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, వాతావరణం చల్లబడే వరకు మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో దాతలు, నిర్వాహకులు పాల్గొన్నారు.